సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
మంగళవారం, 13, మే, 2025



సోమశిలలో 48.250 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో సోమవారం 48.250 టీఎంసీల నీరుంది. పెన్నార్ డెల్టాకు 5030, ఉత్తర,దక్షిణ కాలువలకు 150 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.96,200
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.8,762
మూడు శాతం జీఎస్టీతో	రూ.9,025
నవర (8 గ్రాములు)	రూ.72,200

గరిష్టం/కనిష్టం
41.0 /29.5

వాతావరణం

జిల్లాలో వాతావరణం మంగళవారం పొడిగా ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ సోమవారం 50 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

నెల్లూరు (టౌన్): ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. ఉదయం జరిగిన ప్రథమ సంవత్సర పరీక్షకు 6,407 మంది విద్యార్థులకు గాను, 6,129 మంది హాజరయ్యారు. 278 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన ద్వితీయ సంవత్సర పరీక్షకు 615 మంది విద్యార్థులకు 572 మంది హాజరు కాగా, 43 మంది గైర్హాజరయ్యారు. ఆర్ఐఓ వరప్రసాద్‌రావు, ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్ అధికారులు మొత్తం 27 కేంద్రాల్లో తనిఖీ చేశారు. ఎండ తీవ్రతతో విద్యార్థులతో వచ్చిన తల్లిదండ్రులు బయట పడిగాపులు కాశారు. ఎండ తీవ్రతకు ఇబ్బందులు పడ్డారు.

అనారోగ్యంతో ఖైదీ మృతి

వెంకటాచలం: చెముడుగుంట సమీపంలో ఉన్న జిల్లా జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న షేక్ అబ్దుల్లా (41) సోమవారం అనారోగ్యంతో మృతి చెందాడు. పోలీసుల సమాచారం మేరకు ఎన్టీఆర్ జిల్లా మాచవరం ప్రాంతానికి చెందిన షేక్ అబ్దుల్లా సూర్యాపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన ఓ కేసులో 2024 ఏప్రిల్ 28 తేదీ నుంచి జిల్లా జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్నాడు. సోమవారం ఉదయం 5.55 గంటల సమయంలో స్పృహ కోల్పోయి పడిపోవడంతో వెంటనే జైలు సిబ్బంది చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. జైలు సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

సముద్రంలోకి తాబేళ్ల విడుదల



తాబేళ్ల పిల్లలను వదులుతున్న అటవీ అధికారులు

నెల్లూరు(అర్బన్): జిల్లా అటవీ శాఖాధికారి కె.మహబూబ్‌బాషా సారథ్యంలో సోమవారం పలుచోట్ల పెద్ద సంఖ్యలో ఆలివ్‌రిడ్లీ తాబేళ్ల పిల్లలను సముద్రంలోకి విడుదల చేశారు. డీఎఫ్‌ఓ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో తాబేళ్లు కీలక పాత్ర పోషిస్తున్నాయన్నారు. మత్స్య సంపద పెరగడంలో వాటి పాత్ర ఎంతో ఉందన్నారు. మైపాడు, ఎర్రన్నదిబ్బ, ఊటుకూరు, రామచంద్రాపురం, కొత్తూరు, పాతపాళెం, లక్ష్మీపురం, ఒట్టూరు, కర్లపాళెం, తాటిచెట్లపాళెం తదితర 10 ప్రాంతాల్లో హేచరీల నుంచి సముద్రంలోకి తాబేళ్లను విడుదల చేశామన్నారు. ఈ సంవత్సరంలో ఇప్పటి వరకు మొత్తం 24,481 తాబేళ్ల పిల్లలను వదిలినట్లు తెలిపారు. తాబేళ్లకు హాని కలుగకుండా జాలర్లు సముద్రంలో వేట సాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో కావలి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్, సెక్షన్ ఆఫీసర్, సముద్ర తాబేళ్ల పరిరక్షణ కమిటీ మెంబర్లు పాల్గొన్నారు.

వీఆర్‌కు కొండాపురం ఎస్సై

కొండాపురం: కొండాపురం ఎస్సై వెంకట్రావును వీఆర్‌కు బదిలీ చేస్తూ చర్యలు తీసుకున్నట్లు సమాచారం. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు.. కావలికి చెందిన ఓ మహిళతో ఎస్సై అసభ్యకరంగా ప్రవర్తించడంతో ఆమె కావలి ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో ఆదివారం రాత్రి ఎఫ్ఐఆర్ నమోదు చేయడంతో ఎస్సైను వీఆర్‌కు బదిలీ చేసినట్లు సమాచారం. ఈ విషయంపై కలిగిరి సీఐ వెంకట నారాయణను సంప్రదించేందుకు ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

జెన్‌కో కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన



అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్న కార్మికులు

ముత్తుకూరు (పొదలకూరు): ముత్తుకూరు మండలంలోని నేలటూరు జెన్‌కోలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ కార్మికులు తమను కాంట్రాక్ట్ కార్మికులుగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ సోమవారం అర్ధనగ్న ప్రదర్శన చేశారు. జాయింట్ యాక్షన్ కమిటీ నేతలు మాట్లాడుతూ నెల రోజులుగా నిరసనలు చేపట్టుతున్నా.. యాజమాన్యంలో చలనం లేదన్నారు. జెన్‌కోలో 1,500 మంది కాంట్రాక్ట్ కార్మికులు ఉన్నారని, మరో 500 మంది అవుట్ సోర్సింగ్ కార్మికులు ఉన్నారని తెలిపారు. అవుట్ సోర్సింగ్ కార్మికులు ఏహెచ్‌పీ (యాష్ హ్యాండ్లింగ్ ప్లాంట్), సీహెచ్‌పీ (కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్), ఈటీసీఎస్ (కన్వేయర్ బెల్ట్)ల్లో అతిప్రమాదకరమైన ప్రాంతంలో పనిచేస్తున్నారన్నారు. కాంట్రాక్టర్లుగా ఉన్న వారు అవుట్ సోర్సింగ్ కార్మికుల వద్ద పది మంది పనిని ఒకరితో చేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగ భద్రత, ప్రాణాలకు భద్రత లేనందున తమను కాంట్రాక్ట్ కార్మికులుగా గుర్తిస్తే చట్టపరమైన హక్కులు లభిస్తాయని చెప్పారు. ఈ ఆందోళనలో జేఏసీ కన్వీనర్ గోడ భాస్కర్, నాయకులు శేఖర్, ఆదిశేషయ్య, శ్యాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు వెంకటేశ్వరపురం వద్ద పెన్నానదిలో నిర్మిస్తున్న రక్షణ గోడ



మరో మోసానికి సిద్ధం

పెన్నా పరీవాహక ప్రాంతంలో ఇళ్ల పట్టాలంటూ మంత్రి నారాయణ ప్రకటన

అధికారమే పరమావధిగా కూటమి నేతలు సాగించిన మోసపూరిత ప్రచారాలతో పేద ప్రజల జీవితాలు ఇప్పటికే తలకిందులయ్యాయి. తాజాగా పెన్నా పరీవాహక ప్రాంతంలోని నివాసితులకు శాశ్వత ఇళ్ల పట్టాలిస్తామంటూ ఆశలు రేకెత్తిస్తూ మంత్రి నారాయణ ప్రకటన చేసి మరో మోసానికి తెర తీశారు. గత ప్రభుత్వ హయాంలోనే అప్పటి మంత్రి అనిల్‌కుమార్‌యాదవ్ వారికి నివేశన పట్టాలు పంపిణీ చేశారు. మంత్రి నారాయణ ఇస్తామన్న పట్టాలు సదరు పేదలకు ఎందుకూ ఉపయోగపడవని, చెల్లుబాటు కావనే విషయాన్ని సుప్రీం కోర్టు ఆదేశాలు స్పష్టం చేస్తున్నాయి. అయినా పేదల జీవితాలతో మంత్రి నారాయణ డ్రామాలు ఆడుతూ స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం పాకులాడుతున్నారని అర్థమవుతోంది.

- గత ప్రభుత్వ హయాంలోనే నివేశన పట్టాలు పంపిణీ
- స్వార్థ రాజకీయాల కోసం పేదలతో డ్రామాలు
- భగత్‌సింగ్ కాలనీలో 1,400 కుటుంబాలకు శాశ్వత అన్యాయం



భగత్‌సింగ్‌కాలనీ సమీపంలో పెన్నానదికి నిర్మిస్తున్న రిటర్నింగ్ వాల్



నెల్లూరు నగరం పరిధిలోని నివసించే వారికి ఇళ్ల పట్టాలను అందజేస్తున్న మాజీ మంత్రి అనిల్‌కుమార్‌యాదవ్ (ఫైల్)

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: 'చెరువులు, నీటి కుంటలు, నదులను పరిరక్షించుకోవడం మన అందరి బాధ్యత. పరీవాహక ప్రాంతాల్లో శాశ్వత నిర్మాణాలు చేపట్టరాదు. నీటి వనరులను సంరక్షించుకుంటే అవి మన భవిష్యత్ తరాలను కాపాడుతాయి' ఇది గతంలో సుప్రీంకోర్టు అభిప్రాయం వ్యక్తపరుస్తూ కొన్ని ఆదేశాలు రాష్ట్ర ప్రభుత్వాలకు జారీ చేసింది. ఈ ఆదేశాల ప్రకారమే పక్కనే ఉన్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం హైడ్రా ఏర్పాటు చేసి చెరువుల్లో నిర్మాణాలను తొలగింపునకు శ్రీకారం చుట్టింది. ఈ క్రమంలో నెల్లూరులో కూడా హైడ్రా ఏర్పాటు చేసి నదీ తీరాలు, చెరువుల్లో ఆక్రమణలు తొలగిస్తామని గతంలో మంత్రి నారాయణ చెప్పారు. అయితే ఇప్పుడు అందుకు విరుద్ధంగా నగర పరిధిలో పెన్నానది అంతర్భాగమైన భగత్‌సింగ్ కాలనీలో నివాసాలు ఏర్పాటు చేసుకున్న పేదలకు ఇళ్ల పట్టాలు ఇస్తామని, మంత్రి వర్గం ఆమోదం తెలిపిందని చెప్పడం చూస్తుంటే నిజంగా ఆ పేద వర్గాలకు శాశ్వత అన్యాయం చేస్తున్నారని స్పష్టమవుతోంది.

శాశ్వత పట్టాలిస్తే..

భగత్‌సింగ్ కాలనీలో సుమారు 1400 పేద కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. ఇప్పటికే ఆయా స్థలాల్లో శాశ్వత నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. ఇప్పుడు మంత్రి నారాయణ చెప్పినట్లు పట్టాలిస్తే.. ఆ స్థలాలపై శాశ్వత హక్కుగా భావించి ఆ పేదలు తమ జీవిత కాలం కష్టపడి సంపాదించుకున్న రూ.లక్షల ఖర్చు పెట్టుకుని పక్కా భవనాలు నిర్మించుకునే అవకాశం ఉంది. ఇతరులకు క్రయవిక్రయాలు చేసుకునే పరిస్థితులు ఉంటాయి. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్, సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు భవిష్యత్‌లో ఈ స్థలాల్లోని నిర్మాణాలను తొలగించాల్సి వస్తే.. ఆ పేదలు శాశ్వతంగా నష్టపోయే అవకాశాలు ఉన్నాయి. పెన్నానది పరీవాహక అంతర్భాగంగా ఉన్న ఆ ప్రాంతంలో ప్రభుత్వం ఇచ్చే ఇళ్ల పట్టాలు చెల్లుబాటు అవుతాయా? అనేది అందరిలో అనేక అనుమానాలు ఉన్నాయి. ఈ అనుమానాలు నిజమే. ఈ పట్టాలు ఎందుకు ఉపయోగపడే అవకాశమే లేదని పర్యావరణ వేత్తలు స్పష్టం చేస్తున్నారు. ఈ విధంగా ఆ పేదలకు అన్యాయం చేసినట్లే అవుతుంది.

మాజీ మంత్రి అనిల్ హయాంలో నివాస ధ్రువీకరణ పత్రాలు

భగత్‌సింగ్ కాలనీలో అన్ని వర్గాల ప్రజలు నివాసముంటున్నారు. దాదాపు 14 వందల కుటుంబాలు అక్కడ ఏళ్ల కాలంగా నివాసముంటున్నాయి. పెన్నానది అంతర్భాగంలోనే వారు నివాసాలు ఏర్పాటు చేసుకుని జీవిస్తున్నారు. గత ప్రభుత్వాలు వారికి మౌలిక సదుపాయాలైన విద్యుత్, నీరు వసతి ఏర్పాటు చేశారు. ప్రతి ఎన్నికల సమయంలో ఇళ్ల పట్టాలిస్తామని హామీ ఇచ్చారు. కానీ గతంలో ఎవరూ పట్టించుకోలేదు. గత ప్రభుత్వ హయాంలో మంత్రిగా ఉన్న పొలుబోయిన అనిల్ కుమార్‌యాదవ్ ఇచ్చిన హామీని నెరవేర్చేందుకు ఇళ్ల పట్టాలు ఇచ్చేందుకు సాధ్యాసాధ్యాలను పరిశీలించారు. ఉన్నత స్థాయిలో కూడా చర్చలు జరిపినా సుప్రీంకోర్టు గైడ్‌లైన్స్ ప్రకారం ఇవ్వకూడదని తేల్చి చెప్పారు. కానీ ఆయన పట్టువదలని విక్రమార్కుడులా గత ఎన్నికలకు ముందే వారిని శాశ్వత నివాస పత్రాలు కాకుండా నివాస ధ్రువీకరణ పత్రాలు ఇప్పించారు. ఆయనే భగత్‌సింగ్ కాలనీ వాసులకు తన చేతుల మీదుగా పంపిణీ చేశారు. గతంలో ఎవరూ చేయని పని అనిల్‌కుమార్‌యాదవ్ చేయడంతో ఆ పేదల్లో ఆనందం వెల్లివిరిసింది. వరదల సమయంలో నీటిలో మునిగిపోయే ఆ భగత్‌సింగ్‌కాలనీకి ఆ ముంపు రాకూడదనే ఉద్దేశంతో పెన్నానదికి రూ.100 కోట్ల వ్యయంతో రక్షణ గోడ నిర్మాణం చేయించారు. వరదల సమయంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆ కాలనీలో పర్యటించేలా చేసి వాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారు. ప్రస్తుతం ఆ గోడ నిర్మాణం కూడా పూర్తయ్యే దశలో ఉంది.

ఆగిన శిల్పారామం

గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో బుజబుజ నెల్లూరు సమీపంలో ఉన్న చెరువులో శిల్పారామం ఏర్పాటు చేసేందుకు టెండర్లు పిలిచి పనులు కూడా చేపట్టారు. కానీ స్థానిక పర్యావరణ వేత్తలు చెరువులో నిర్మాణాలు ఎలా చేపడుతారని న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో ఆ నిర్మాణం నిలిచిపోయింది. నదులు, నీటికుంటల పరిధిలోని వంద మీటర్ల వరకు ఎలాంటి శాశ్వత నిర్మాణాలు చేపట్టకూడదనే జీఓ నంబర్119/2017లో స్పష్టం చేస్తోంది. ప్రభుత్వ జీఓలకు విరుద్ధంగా మంత్రి నారాయణ ఇళ్ల పట్టాలు ఇప్పిస్తానంటూ ప్రచారం చేసుకోవడం వెనుక తన స్వార్థ రాజకీయ ప్రయోజనాలు కోసమేనన్న ప్రచారం ఉంది.

మాస్టారు.. ఇది సాధ్యమేనా?

నగర నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఉన్న మంత్రి నారాయణ భగత్‌సింగ్ కాలనీవాసులకు శాశ్వత ఇళ్ల పట్టాలు ఇస్తానంటూ నమ్మబలికాడు. మంత్రి వర్గం కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని చెబుతున్నాడు. ఆ పేదల ఆశలు నెరవేరుతాయని పెద్దగా పబ్లిసిటీ చేస్తున్నారు. వాస్తవంగా పెన్నానది అంతర్భాగంలో ఉండే ఆ కాలనీలో ఇళ్ల పట్టాలు పంపిణీ చేసినా అవి ఉపయోగపడవనే భావన ప్రజల్లో ఉంది. సుప్రీం కోర్టు గైడ్‌లైన్స్‌ను కాదని పత్రాలు పంపిణీ చేసినా అవి ఎందుకూ ఉపయోడపడవని పర్యావరణ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఉన్నతాధికారులు సైతం మంత్రి నారాయణ నిర్ణయాలను చూసి నివ్వెరపోతున్నారు. పేద వర్గాలకు అన్యాయం చేసేందుకే అని అంటున్నారు.



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

రథంపై ఆశీనులైన స్వామి, అమ్మవార్లు

కల్యాణం.. వైభోగం

- నవవధూవరులుగా ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీ దేవి, నృసింహుడి దర్శనం
- ఇదే సమయంలో ఒక్కటైన పలు జంటలు
- వేలాదిగా తరలివచ్చిన భక్తులు

రాపూరు: పెంచలకోన లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. సోమవారం పెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీ దేవి కల్యాణాన్ని వేదమంత్రాలు, మంగళవాయిద్యాల మధ్య శాస్త్రోక్తంగా నిర్వహించారు. కల్యాణాన్ని తిలకించేందుకు వేలాది మంది భక్తులు తరలివచ్చారు. ఉదయం స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు చేశారు. 9.50 గంటలకు ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిలో కొలువుదీర్చి కల్యాణ మండపానికి వేంచేపు చేశారు. తొలుత విష్వక్సేన పూజ అనంతరం స్వామి, ఆదిలక్ష్మీ, చెంచులక్ష్మీ అమ్మవార్ల గోత్రాలతో కన్యాదాన ఘట్టాలను కనుల పండువగా నిర్వహించారు. కల్యాణ వేడుకను వేద పండితులు వివరిస్తూ శాస్త్రోక్తంగా చేపట్టారు.

శ్రీవారి కల్యాణంలో ఒక్కటైన జంటలు

శ్రీవారి కల్యాణం జరిగే ముహూర్తానికి పలు జంటలు ఒక్కటయ్యాయి. స్వామి వారి కల్యాణ ముహూర్తం రోజు పెళ్లి చేసుకుంటే సకల సౌభాగ్యాలు కలుగుతాయనే నమ్మకంతో ఏటా ఇక్కడ వివాహాలు చేసుకోవడం ఆనవాయితీ. స్వామి కల్యాణం అనంతరం భక్తులు స్వామి వారికి రూ.1,65,504 చదివింపులు అందజేశారు.

రమణీయం.. రథోత్సవం

పెనుశిల లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి స్వామి వారు ఉభయ నాంచారులతో కలిసి రథంపై కొలువుదీరి కోన తిరువీధుల్లో ఊరేగారు. భక్తుల గోవింద నామస్మరణతో రథాన్ని లాగారు. రథోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

గజ వాహనోత్సవం

స్వామి వారు ఉభయ దేవేరులతో కలిసి రాత్రి 10 గంటలకు గజ వాహనంపై కోన మాడ వీధుల్లో విహరించారు. రాత్రి 12 గంటకు ఏకాంతసేవ నిర్వహించారు. కార్యక్రమంలో వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ దంపతులు, ఫెస్టివల్ కమిటీ సభ్యులు చెన్ను తిరుపాల్‌రెడ్డి, సోమయ్య, ఉప ప్రధానార్చకులు పెంచలయ్య స్వామి, సీతా రామయ్యస్వామి, టీటీడీ పాంచరాత్ర ఆగమ పండితులు రామానుజాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

నేడు చక్రస్నానం, తెప్పోత్సవం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం 7 గంటలకు వసంతోత్సవం, 9 గంటలకు చక్రస్నానం, తదుపరి స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. రాత్రి 7 గంటలకు శ్రీవారి పుష్కరిణిలో తెప్పోత్సవం, 9 గంటలకు అశ్వవాహన సేవ, 11 గంటలకు ధ్వజావరోహణం నిర్వహిస్తామని అధికారులు తెలిపారు.



కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు



వేదమంత్రోచ్ఛరణల మధ్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ఈతకెళ్లి అన్నదమ్ములు గల్లంతు



కాలువ వద్ద గాలింపు చర్యల్లో పోలీసులు



కనిగిరి రిజర్వాయర్ ప్రధాన కాలువలో నీటి ఉధృతి

- వేసవి సెలవులకు అమ్మమ్మ ఊరు వచ్చిన చిన్నారులు
- పెద్దకాలువ వద్ద ఘటన
- గాలిస్తున్న పోలీసులు, స్థానికులు
- రాత్రి వరకు జాడ తెలియని పరిస్థితి

సంగం: వేసవి సెలవులను అమ్మమ్మ ఇంట్లో ఆనందంగా గడుపుదామని వచ్చిన ఆ చిన్నారులు కనిగిరి రిజర్వాయర్ పెద్ద కాలువలో సోమవారం గల్లంతయ్యారు. కాలువలో మూడు రోజులుగా కొద్దిపాటి నీళ్లు ఉండడంతో చిన్నారులు అందులో ఈతాడుతున్నారు. సోమవారం ఇరిగేషన్ అధికారులు ఆ కాలువకు నీటి ప్రవాహం పెంచడంతో ఆ చిన్నారులు రోజులాగే ఉంటుందని భావించి ఈతాడేందుకు వెళ్లి ఆ ఉధృతికి గల్లంతయ్యారు. రాత్రి వరకు పోలీసులు, స్థానికులు, కుటుంబ సభ్యులు గాలించినా జాడ కనిపించలేదు. సంగంకు చెందిన దండె వెంకటరమణమ్మకు ఇద్దరు కుమార్తెలు. చిన్న కుమార్తె శేషమ్మ, బందా గోవిందయ్య దంపతులు కోవూరు మండలం చిన్నపడుగుపాడు స్టూబీడీ కాలనీలో నివాసముంటున్నారు. ఆ దంపతులకు వెంకట చందు (15), వెంకట నందకిశోర్ (13) సంతానం. తల్లిదండ్రులిద్దరూ బేల్దారి పనులకు వెళ్లి కుమారులను చదివించుకుంటున్నారు. పెద్ద కుమారుడు 9వ తరగతి పూర్తి చేసుకుని 10వ తరగతికి, వెంకట నందకిశోర్ 7వ తరగతి పూర్తి చేసుకుని 8వ తరగతికి వచ్చారు. వేసవి సెలవులు కావడంతో 10 రోజుల క్రితం సంగంలోని అమ్మమ్మ వెంకటరమణమ్మ ఇంటికి వచ్చారు. మూడు రోజులుగా స్థానిక చిన్నారులతో కలిసి గ్రామానికి కొద్ది దూరంలో ఉన్న కనిగిరి రిజర్వాయర్ పెద్ద కాలువ వద్దకు వెళ్లి కొద్దిపాటి నీళ్లలో ఈతాడుతున్నారు. అయితే ఇరిగేషన్ అధికారులు సోమవారం కనిగిరి రిజర్వాయర్‌కు సాగునీటిని ఉదయం నుంచి సాయంత్రం వరకు 500 నుంచి 1500 క్యూసెక్కులకు పెంచారు. ఈ విషయం తెలియని చిన్నారులు రోజు మాదిరిగానే కాలువలోకి దిగి ఈతాడేందుకు వెళ్లారు. సాయంత్రం 3 గంటల సమయంలో ఈతకు దిగిన చిన్నారులు గల్లంతయ్యారు. 5 గంటల వరకు కూడా వారి ఆచూకీ తెలియకపోవడంతో కాలువ గట్టున దుస్తులు ఉండడంతో స్థానికులు పోలీసులకు, కుటుంబ సభ్యులకు తెలిపారు. ఎస్సై రాజేష్, పోలీసు సిబ్బంది స్థానికులతో కాలువలో గాలింపు చర్యలు చేపట్టారు. రాత్రి ఇరిగేషన్ అధికారులు సాగునీటి విడుదలను నిలిపివేయడంతో సీఐ వేమారెడ్డి, ఎస్సై రాజేష్ గజ ఈతగాడు వెంకటేశ్వర్లు, స్థానిక యువకులతో కలిసి గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. రాత్రి పొద్దుపోయే వరకు కూడా ఆ చిన్నారుల ఆచూకీ లభ్యం కాలేదు. చిన్నారులు ఈతకు వెళ్లి గల్లంతు కావడంతో వెంకటరమణమ్మతోపాటు, తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. ఇద్దరు బిడ్డల ఆచూకీ తెలియకపోవడంతో వారిని ఓదార్చడం ఎవరికి సాధ్యపడడం లేదు. దీంతో సంగం, కోవూరు స్టూబీడీ కాలనీల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.



వెంకట చందు (ఫైల్)



వెంకట నంద కిశోర్ (ఫైల్)

అధిక లాభాల ఆశ చూపి..

- రూ 21.60 లక్షలు దోచేసిన సైబర్ నేరగాళ్లు

నెల్లూరు (క్రైమ్): ట్రేడింగ్‌లో పెట్టుబడులు పెడితే అధిక లాభాలు వస్తాయని నమ్మించి ఓ వ్యక్తి వద్ద సైబర్ నేరగాళ్లు రూ 21.60 లక్షలు దోచేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు వేదాయపాళెం పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. ఎన్జీఓ కాలనీకి చెందిన మురళికి గతేడాది డిసెంబర్‌లో ఫేస్‌బుక్‌లో వచ్చిన లింక్ ఆధారంగా ఓ ట్రేడింగ్ కంపెనీ యాప్‌లో జాయిన్ అయ్యాడు. సదరు కంపెనీకి చెందిన ప్రతినిధులు ట్రేడింగ్‌లో పెట్టుబడులు పెడితే నాలుగు నెలల్లోనే రెట్టింపు లాభాలు వస్తాయని నమ్మించారు. దీంతో మురళి గతేడాది డిసెంబర్ నుంచి ఈ ఏడాది జనవరి 31వ తేదీ వరకు ఆరు విడతల్లో రూ.21.60 లక్షలు డిపాజిట్ చేశారు. ఈ క్రమంలో ఆయన తన ట్రేడింగ్ ఖాతాలోని రూ.10 లక్షల నగదును డ్రా చేసుకునేందుకు యత్నించగా అవి రాలేదు. దీంతో కంపెనీ ప్రతినిధులను సంప్రదించగా బ్రోకరేజీ ఫీజు రూ.7.99 లక్షలు పంపితే డబ్బు డ్రా చేసుకోవచ్చని చెప్పారు. దీంతో మోసపోయానని గ్రహించిన బాధితుడు ఈ మేరకు వేదాయపాళెం పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కన్నీళ్లతో సమస్యల్ని విన్నవించి..

- ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'
- అర్జీలిచ్చిన 79 మంది

నెల్లూరు(క్రైమ్): 'న్యాయం కోసం పోలీస్‌స్టేషన్ల చుట్టూ తిరుగుతున్నా కనికరించడం లేదు. మీరైనా విచారించి న్యాయం చేయండి' అంటూ పలువురు బాధితులు ఏఎస్పీ సీహెచ్ సౌజన్యను కోరారు. సోమవారం నెల్లూరు నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. జిల్లా నలుమూలల నుంచి 79 మంది విచ్చేసి ఏఎస్పీ, డీఎస్పీ చెంచురామారావును కలిసి వినతులు అందజేశారు. చట్టపరిధిలో విచారణ జరిపి న్యాయం చేస్తామని సౌజన్య హామీ ఇచ్చారు. కార్యక్రమంలో లీగల్ అడ్వైజర్ శ్రీనివాసులురెడ్డి, ఎస్‌బీ–2 ఇన్‌స్పెక్టర్ బి.శ్రీనివాసరెడ్డి, ఫిర్యాదుల విభాగం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


రాజమ్మ ఇచ్చిన వినతిపత్రాన్ని పరిశీలిస్తున్న ఏఎస్పీ సౌజన్య

ఫిర్యాదు చేసినా..
నా ఇంటి పక్కనున్న ఖాళీ స్థలంలో చెత్త వేశానన్న కోపంతో మహిళా కానిస్టేబుల్ స్వప్న, ఆమె భర్త నాపై దాడి చేయడంతో ఎడమ చేయి, కాలు విరిగింది. పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. గత నెల 21వ తేదీన సమస్యను ఎస్పీ దృష్టికి తీసుకెళ్లగా తగిన చర్యలు తీసుకోవాలని కలువాయి పోలీసులను ఆదేశించారు. అయినా వారు పట్టించుకోలేదు. న్యాయం చేయాలని కలువాయి మండలానికి చెందిన వృద్ధురాలు రాజమ్మ కోరారు.

ట్రేడింగ్ పేరిట రూ.10.30 లక్షలు దోచేశారు
నాకు ఫేస్‌బుక్‌లో లిఖిత అనే మహిళ పరిచయమైంది. ఫారెక్స్ ట్రేడింగ్ కంపెనీలో డబ్బులు పెడితే అధిక లాభాలు వస్తాయని నమ్మించింది. రూ.10.30 లక్షలు పెట్టించింది. నా ఖాతాలో పెద్ద మొత్తంలో డబ్బులు చూపించింది. వాటిని విత్‌డ్రా చేసేందుకు యత్నించగా కాలేదు. కస్టమర్ కేర్ సిబ్బందిని సంప్రదించగా కొంత మొత్తంలో పన్ను కడితే మొత్తం డబ్బులు విత్‌డ్రా చేయొచ్చని చెప్పారు. సదరు మహిళ పథకం ప్రకారమే నన్ను మోసగించిందని నెల్లూరుకు చెందిన ఓ యువకుడు అర్జీ ఇచ్చాడు.

ఉద్యోగం పేరిట మోసం
బుచ్చిరెడ్డిపాళెం ప్రాంతానికి చెందిన రఫీ అతడి కుటుంబ సభ్యులు ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి పలు దఫాలుగా నా వద్ద రూ.6 లక్షలు తీసుకున్నారు. నెలలు గడుస్తున్నా ఉద్యోగం ఇప్పించలేదు. దీంతో వారిని నా డబ్బులు తిరిగి ఇవ్వాలని కోరగా దౌర్జన్యం చేస్తున్నారు. చర్యలు తీసుకోవాలని సంగంకు చెందిన ఓ వ్యక్తి కోరాడు.

చంపుతామని బెదిరిస్తున్నారు
నా భర్త మరణించాడు. ఆయన అన్న కుమారుడు రఫీ నేను ఉంటున్న ఇంటిని ఖాళీ చేసి వెళ్లిపోవాలని లేనిపక్షంలో చంపుతామని బెదిరిస్తున్నాడు. స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశా. వారు పట్టించుకోలేదని ఆత్మకూరుకు చెందిన ఓ మహిళ అర్జీ ఇచ్చారు.

వేధిస్తున్నాడు
మనవడైన రమేష్ నా ఆస్తిని తీసుకున్నాడు. ఇప్పుడు నా బాగోగులు పట్టించుకోవడం లేదు. వివిధ రకాలుగా ఇబ్బంది పెడుతున్నాడు. విచారించి చర్యలు తీసుకోవాలని బుచ్చికి చెందిన ఓ వృద్ధురాలు కోరారు.

మేనమామపై చర్యలు తీసుకోవాలి
ఆస్తి విషయంలో నా మేనమామ శివకుమార్ ఇబ్బంది పెడుతున్నాడు. అసభ్యంగా, దురుసుగా ప్రవర్తిస్తున్నాడని నెల్లూరు రూరల్ పరిధికి చెందిన ఓ మహిళ ఫిర్యాదు చేశారు.

కాళ్లరిగేలా తిరుగుతూ..

- నెల్లూరులో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'
- 387 వినతుల అందజేత
- ప్రత్యేక దృష్టి పెట్టాలన్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరు రూరల్: 'సమస్యల పరిష్కారం కోసం కాళ్లరిగేలా తిరుగుతున్నాం. కనికరించండి సారూ' అంటూ అధికారులను మండలాల నుంచి వచ్చిన జనం వేడుకున్నారు. సోమవారం నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో ప్రజా సమస్యల పరిషార వేదిక కార్యక్రమం జరిగింది. కలెక్టర్ ఆనంద్, జేసీ కె.కార్తీక్, డీపీఓ శ్రీధర్‌రెడ్డి, జెడ్పీ సీఈఓ విద్యారమ, డ్వామా పీడీ గంగాభవాని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. మొత్తం 387 మంది వినతులను అందజేశారు. అధికంగా రెవెన్యూ శాఖకు సంబంధించి 131, మున్సిపల్ శాఖవి 42, సర్వేవి 35, పంచాయతీరాజ్ శాఖవి 29, పోలీస్ శాఖవి 62, సివిల్ సప్లయ్స్‌వి 7 తదితరాలు అందాయి. కలెక్టర్ మాట్లాడుతూ అర్జీల విషయంలో జాప్యం లేకుండా వెంటనే పరిష్కరించేందుకు ఆయా శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానంగా రెవెన్యూ అంశాలపై వినతులు ఎక్కువగా వస్తున్నాయని, వాటిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. కార్యక్రమంలో పలువురు జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

పింఛన్ కోసం..
దివ్యాంగుల పింఛన్ ఇప్పించాలని కోవూరు మండలం పడుగుపాడు పంచాయతీకి చెందిన చెముడుగుంట వెంకటసుబ్బయ్య కోరారు. 2024లో ఆరోగ్య సమస్య రావడంతో కాలు తీసేశారన్నారు. 70 శాతం డిజేబులిటీ సర్టిఫికెట్ ఉందని, ఎన్నిసార్లు అధికారుల చుట్టూ తిరిగినా పింఛన్ ఇవ్వలేదన్నారు. ప్రస్తుతం కుటుంబ పరిస్థితి దారుణంగా ఉందని ఆవేదన చెందారు.

చర్యలు తీసుకోవాలంటూ..
ఉపాధి పనుల్లో అవకతవకలపై విచారణ జరిపాలని జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మాజీ సభ్యుడు రఘు వినతిపత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ గత ఆర్థిక సంవత్సరంలో దాదాపు రూ.5 కోట్లకు పైగా అవినీతి జరిగిందన్నారు. 14 మండలాల్లో జరిగిన అవకతవకలపై ఇప్పటి వరకు సిబ్బంది దగ్గర రికవరీ చేయడం గానీ, కేసులు నమోదు చేయడం గాని జరగలేదన్నారు.


మాట్లాడుతున్న రఘు

సెలవుల్లో ప్రత్యేక తరగతులు


మాట్లాడుతున్న పీడీఎస్‌యూ నాయకులు

నెల్లూరు నగరంలో పలు ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లు ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా అడ్మిషన్లు చేస్తున్నాయని, దీనిపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ నెల్లూరు జిల్లా సెక్రటరీ షేక్ షారూక్ వినతిపత్రం ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ సెలవు రోజుల్లో కాలేజీల్లో తరగతులు నిర్వహిస్తూ విద్యార్థులను ఒత్తిడికి గురి చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు మస్తాన్, నసీన్, హర్ష తదితరులు పాల్గొన్నారు.

దారి మూసేశారు
తన మామిడితోటకు దారి ఇవ్వకుండా మూసేశారని బోగోలు మండలం ఎస్‌వీపాళెం గ్రామస్తుడు ద్వారం వెంకటేశ్వర్లు వినతిపత్రం సమర్పించారు.


మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

ఆయన మాట్లాడుతూ 30 సంవత్సరాల క్రితం సర్వే నంబర్ 88లో 62 సెంట్ల భూమిని ప్రభుత్వం ఇచ్చిందన్నారు. అందులో మామిడి సాగు చేపట్టానన్నారు. ద్వారం శ్రీనివాసులు, నాగరాజమ్మ తోటలోకి దారి ఇవ్వకుండా అడ్డుకుంటున్నారని వాపోయాడు.

అవినీతిపై విచారణ జరపాలి
మహిళలకు కుట్టు శిక్షణ పేరుతో తెరతీసిన అవినీతిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఉమ్మడి నెల్లూరు జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు డేగా వంశీకృష్ణ వినతిపత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ ట్రైనింగ్ కోసం ప్రభుత్వం ఒక్కొక్కరికి రూ.23 వేలు కేటాయించిందన్నారు. వాస్తవానికి ఒక మెషీన్‌కు రూ.4,300 మాత్రమే ఖర్చవుతుందన్నారు. శిక్షణలో మహిళలకు మంచినీరు తప్ప ఇంకేమీ ఇవ్వరన్నారు. ఇదంతా టెండర్ దక్కించుకున్న కంపెనీకి దోచిపెట్టేందుకే అని తెలిపారు. కార్యక్రమంలో నేతలు కోవూరు బీసీ సెల్ అధ్యక్షుడు శ్రీకాంత్, ఎంపీటీసీ సభ్యుడు వెంకటేష్, అరవ సుబ్బయ్య, డేగ శ్రీనివాసులు పాల్గొన్నారు.


వినతిపత్రం ఇచ్చిన నేతలు

డీఎస్సీ గడువు పొడిగించాలి
డీఎస్సీ అభ్యర్థుల వయోపరిమితిని 47 సంవత్సరాలకు పెంచాలని, ప్రిపరేషన్ సమయం 45 రోజుల నుంచి 90 రోజులకు పెంచాలని సిటీ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్ ఆనంద్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సిటీ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కె.సంజయ్‌కుమార్ మాట్లాడుతూ బీఈడీ, డీఈడీ పూర్తి చేసిన అభ్యర్థులు టెట్, డీఎస్సీ రాయడానికి అవకాశం ఇవ్వాలని మొరపెట్టుకున్నా పట్టించుకోకుండా ప్రభుత్వం మొండి వైఖరితో 45 రోజుల్లో పరీక్ష నిర్వహిస్తామని చెప్పడం దారుణమన్నారు. ఈ పరీక్ష కోసం లక్షలాది మంది ఎదురు చూస్తున్నారని, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులన్నీ భర్తీ చేయాలన్నారు. ప్రతి సంవత్సరం డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో నేతలు సుధీర్, మల్లికార్జున రెడ్డి, ఇర్ఫాన్, రెహమాన్, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

వీర జవాన్‌కు నివాళి

నెల్లూరు(పొగతోట): వీర మరణం పొందిన మురళీ నాయక్‌కు సోమవారం నెల్లూరులోని జిల్లా పరిషత్ కార్యాలయంలో జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, అధికారులు నివాళులర్పించారు. మురళి చిత్రపటానికి పూలమాల వేశారు. ఈ సందర్భంగా అరుణమ్మ మాట్లాడుతూ వీర జవాన్ అయిన మురళీనాయక్ త్యాగాన్ని దేశం మర్చిపోదన్నారు. అతని తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ విద్యారమ, డిప్యూటీ సీఈఓ మోహన్‌రావు, ఉద్యోగులు పాల్గొన్నారు.


నివాళులర్పించిన అరుణమ్మ, అధికారులు

కార్మికులకు శిక్షణ


శిక్షణలో పాల్గొన్న అధికారులు, కార్మికులు

నెల్లూరు(బృందావనం): అమ్మోనియా గ్యాస్ లీకైతే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జిల్లాలోని బుంగే ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఫ్యాక్టరీలో ఫ్యాక్టరీస్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో సోమవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ సీహెచ్ శైలేంద్ర కుమార్ నెల్లూరలో మాట్లాడుతూ బీఎంఆర్, వాటర్‌బేస్, సాయి మెరైన్, బుంగే, ఇమామీ, జెమినీ, సౌత్ ఇండియా, త్రీఎఫ్, ఆంజనేయ, గ్రీన్‌హౌస్, అల్ఫా మెరైన్, శరత్ తదితర కర్మాగారాల నుంచి 42 మంది పాల్గొన్నారని, సేఫ్టీ ఆఫీసర్లు విన్సెంట్‌పాల్, మహేంద్ర, పి.శ్రీను శిక్షణ ఇచ్చారన్నారు.

కండలేరులో 44.313 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో సోమవారం నాటికి 44.313 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సత్యసాయి గంగ కాలువకు 850, పిన్నేరు కాలువకు 20, లోలెవల్ కాలువకు 60, హైలెవల్ కాలువకు 110, మొదటి బ్రాంచ్ కాలువకు 70 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.


నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 136
లేయర్ (లైవ్)	: 110
బ్రాయిలర్ చికెన్	: 244
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 270
లేయర్ చికెన్	: 187



నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి	: రూ.80
సన్నవి	: రూ.40
పండ్లు	: రూ.25



రోడ్డు ప్రమాదంలో ల్యాబ్ టెక్నీషియన్ మృతి

నెల్లూరు(క్రైమ్): రోడ్డు ప్రమాదంలో ల్యాబ్ టెక్నీషియన్ మృతిచెందిన ఘటన నెల్లూరులోని ఆత్మకూరు బస్టాండ్ ఫ్లై ఓవర్‌పై చోటుచేసుకుంది. నార్త్ ట్రాఫిక్ పోలీసుల కథనం మేరకు.. కోవూరు మండలం చుండుగుంట గ్రామానికి చెందిన ఎస్.సాయి వెంకటప్రతాప్ (26) నెల్లూరు పొగతోటలోని విజయ ల్యాబ్‌లో టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. అతను సోమవారం స్కూటీపై ల్యాబ్‌కు బయలుదేరాడు. ఫ్లై ఓవర్‌పై వెళ్తుండగా ట్రాక్టర్ స్కూటీని ఢీకొనడంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న నార్త్ ట్రాఫిక్ ఎస్సై జె.బలరామిరెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. మృతుడి తండ్రి శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని..

- వ్యక్తి మృతి

వరికుంటపాడు: గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన వరికుంటపాడు మండల కేంద్రంలోని వెంకటేశ్వర స్వామి ఆలయ సమీపంలో సోమవారం జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. కనియంపాడుకు చెందిన దొడ్ల మాధవ (38) తన మోటార్‌బైక్‌పై కనియంపాడు నుంచి పామూరుకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో పామూరు వైపు నుంచి దుత్తలూరు వైపు వస్తున్న గుర్తుతెలియని వాహనం వరికుంటపాడు సమీపంలో బైక్‌ను ఢీకొట్టడంతో మాధవ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు గమనించి 108 అంబులెన్స్‌లో ఉదయగిరి వైద్యశాలకు తరలిస్తుండగా దారిలో మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్సై రఘునాథ్ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.